నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
10 | వరంగల్, శనివారం 14 డిసెంబర్ 2024 | MAHABUBABAD

సమగ్ర శిక్షా ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్న బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

సమ్మెలో ప్లకార్డును చూపిస్తున్న మహిళా ఉద్యోగి

రెగ్యులరైజ్ హామీని అమలు చేయాలి

- సమగ్ర శిక్షా ఉద్యోగులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటది
- సమ్మెకు మద్దతు తెలిపిన దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ, డిసెంబర్ 13: ఎన్నికల ముందు సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన రెగ్యులరైజ్ హామీని సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్య క్షుడు దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలా పార్కు ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగుల వద్దకు వెళ్లి తమ మద్దతు ప్రకటించారు. ఎనిమిది రోజులుగా తమ న్యాయపరమైన డిమాండ్ల పరిష్కరించాలని కోరుతూ రిలే నిరాహార దీక్ష, సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, హరీశ్‌రావు రాష్ట్రవ్యాప్తంగా తమ మద్దతు ప్రకటించారన్నారు. త్వరలో జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ పార్టీ వారి సమస్యలను లేవనెత్తుతుందని ఆయన తెలిపారు. సమగ్ర శిక్షా ఉద్యోగులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కాగా, వీరి సమ్మెకు పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్‌తో పాటు పలు సంఘాలు తమ మద్దతు ప్రకటించాయి.

భూపాలపల్లి పట్టణంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

(ఇన్‌సెట్) తమ బాధలను మాజీ ఎమ్మెల్యే గండ్రకు తెలియజేస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులు

పేదల ఇళ్లపై ఇంత అలుసా?

- డబుల్ బెడ్ రూం ఇండ్లపై రాజకీయం చేయడం సిగ్గుచేటు
- కాంగ్రెస్ నాయకులకు కట్టబెట్టేందుకు ఎమ్మెల్యే కుట్ర
- ఏడాది దాటినా పట్టాలివ్వకపోవడంలో ఆంతర్యమేమిటో?
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణ కాలనీ, డిసెంబర్ 13: పేదలకిచ్చిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లపై రాజకీయాలు చేయడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని భాస్కర్ గడ్డలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు పట్టాలివ్వాలని 22 రోజులుగా లబ్ధిదారులు ధర్నా చేస్తుండగా, శుక్రవారం ఎమ్మెల్యే గండ్ర స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో భాస్కర్‌గడ్డలో 416 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు నిర్మించి 2023 అక్టోబర్ 8వ తేదీన డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసి ఇండ్లు కేటాయిస్తే, ఆ తర్వాత ఎన్నికల కోడ్ వచ్చిందన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదైనా వారికి పట్టాలివ్వలేదన్నారు. ఎందుకు జాప్యం చేస్తున్నారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు పేదలపై ప్రేమ ఉంటే వెంటనే ఎంపిక చేసిన 392 మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలిచ్చి, వారిని గృహప్రవేశం చేయించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు ఫొటోల సోకు బాగుందని, లబ్ధి దారులతో గృహప్రవేశం చేయించి వారితో ఫొటో దిగాలని వాపోయారు. ఎమ్మెల్యే అండదండలతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయా వార్డుల్లో డబుల్ బెడ్ రూము ఇళ్లు ఇప్పిస్తామంటూ పైస లు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు డబుల్ బెడ్ రూములు ఇచ్చేందుకే ఫైల్ మిస్సయిందని కలెక్టర్ తప్పుడు సమాచారం ఇస్తున్నాడని, నాడు పంపిణీ చేసిన వీడియో క్యాసెట్ బయటకు తీస్తే అసలైన లబ్ధిదారులు తెలిసిపోతారన్నారు. కాంగ్రెస్ కార్య కర్తలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టబెట్టాలనే లక్ష్యంతో జాప్యం చేస్తున్నారన్నారు. మంత్రి శ్రీధర్ బాబు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగిలేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని లబ్ధిదారులకు పట్టాలిచ్చేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే తాళాలు పగలగొట్టి ఇండ్లలోకి వెళ్తామని, ఎన్ని కేసులు పెట్టినా జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నానని హెచ్చరించారు. ఈ విషయంపై మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబుకు వెంకటరమణారెడ్డి ఫోన్ చేయగా సానుకూలంగా స్పందించి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలిచ్చేలా చూస్తామని చెప్పారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ నూనె రాజు పటేల్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు కొత్త హరిబాబు, మేకల రజిత, బానోత్ రజిత, ఎడ్ల మౌనిక, మంగళపల్లి తిరుపతి, దార పూలమ్మ, ముంజంపల్లి మురళీధర్, ఆకుదారు మమత, కో ఆప్షన్ మెంబర్ దొంగల ఐలయ్య, జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కల్లెపు రఘుపతిరావు, నాయకులు నాగుల దేవేందర్ రెడ్డి, బండారు రవి, చిరంజీవి, కరీం, మామిడి కుమార్, పోలవైన అశోక్, ఈశ్వర్, శ్రీకాంత్ పటేల్ పాల్గొన్నారు.

మా భర్తలకు ఫోన్లు చేసి తిట్టిస్తున్నరు

మాకు ప్రభుత్వం కేటాయించిన ఇండ్లకు పట్టాలివ్వకపోవడమే కాకుండా ధర్నా చేయడానికి వస్తుంటే స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మా భర్తలకు ఫోన్లు చేసి మమ్మల్ని తిట్టిస్తున్నరు. ధర్నాకు ఎందుకు పోతున్నమని నిలదీసున్నరు. ఎమ్మెల్యే దగ్గరకి పోతే నా దిష్టిబొమ్మ తగలబెట్టినా మీకు ఇండ్లు ఇవ్వనని అంటున్నడు. కలెక్టర్ వద్దకు పోతే పట్టించుకోవడం లేదు. రమణారెడ్డి సార్ మా బాధను పట్టించుకొని మాకు పట్టాలిప్పించేలా కృషి చేయాలి. గతంలో మీరే మాకు ఇల్లు ఇచ్చారు. పట్టాలిచ్చేంత వరకు కూడా మాకు మద్దతునివ్వండి.

– లబ్ధిదారులు మాధవి, రజిత

జ్యుడీషియల్ విచారణ చేపట్టాలి

- రాజన్న కోడెల విక్రయ కేసులో మండల నాయకుల హస్తం
- అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల తో పక్కదారి పట్టించేందుకు యత్నం
- ఈ వ్యవహారంలో మంత్రి కొండా క్షమాపణ చెప్పాలి
- విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు

గీసుగొండ, డిసెంబర్ 13 : అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో రాజన్న కోడెల విక్రయ కేసును పక్కదారి పట్టించేందుకు యత్నిస్తున్నారని, జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలని బీజేపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కాళీ ప్రసాద్‌రావు, రాష్ట్ర నాయకుడు విజయచందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ ధర్మారం శివారులో బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి సురేఖ సిఫారసు మేరకు ఆలయ అధికారులు 66 కోడెలను రాంబాబు, మందస్వామి, పసునూటి శ్యామ్‌సుందర్‌కు ఇచ్చినట్లు పోలీసుల విచారణలో బయటపడిందన్నారు. మంత్రి సురేఖ హిందువుల మనోభావాలను కించపరిచేలా కోడెల వ్యవహారంలో అవకతవకలు జరగలేదంటూ నిందితులకు వత్తాసు పలుకుతూ ప్రకటన చేయడం సిగ్గు చేటన్నారు. దీనికి దేవాదాయ శాఖ మంత్రి సురేఖ బాధ్యత వహిస్తూ బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. హిందువులను కించపరిచేలా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని, భక్తులు దేవుడికి సమర్పించే కోడెలను విక్రయించడమంటే హిందువులపై దాడి చేసినట్లేనని అన్నారు. రాంబాబు అన్యమతస్తుడని, అతడికి హిందూ దేవాలయం నుంచి కోడె లు ఇవ్వడం, వాటిని కబేళాలకు విక్రయించడం దారుణమన్నారు. ఈ వ్యవహారంపై స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి స్పందించాలన్నారు. ఇందులో మండల నాయకుల హస్తం ఉందన్నారు. వేములవాడ ఈవోను సస్పెండ్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. జరిగిన తప్పును మంత్రి ఒప్పు కోకుండా ఆ విషయాలను వెలుగులోకి తెచ్చిన పత్రికలపై కేసులు పెడతామని బెదిరించడం ఆమె అహంకారానికి నిదర్శనమన్నారు. ఈ విషయంపై గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులకు బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని, మా నాయకులకు ఏం జరిగినా రాష్ట్రాన్ని అగ్నిగుండం చేస్తామని హెచ్చరించారు. మండల అధ్యక్షుడు జాన్‌విక్రమ్, నియోజకవర్గ కన్వీనర్ ములక ప్రసాద్, నాయకులు కక్కెర్ల శ్రీనివాస్, రాజు, ల్యాద రాజేశ్, కే రవి, అఖిల్, వెంకన్న, రాజిరెడ్డి, సాంబరాజు, బాలరాజు, రాము, ప్రదీప్ పాల్గొన్నారు.

బీజేపీ వరంగల్ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు కాళీప్రసాద్‌రావు, విజయచందర్‌రెడ్డి

విద్యార్థులను ఆటపోటీలకు తీసుకెళ్తూ..

- రైలు కింద పడి పీఈటీ మృతి

వీరన్న(ఫైల్)

ఖిలావరంగల్, డిసెంబర్ 23 : విద్యార్థులను ఆటల పోటీలకు తీసుకెళ్లేందుకు స్టేషన్‌కు వచ్చిన ఓ పీఈటీ ఎక్కాల్సిన రైలు కిందనే పడి మృత్యువాతపడ్డాడు. ఈ విషాద సంఘటన వరంగల్ రైల్వే స్టేషన్‌లో శుక్రవారం జరిగింది. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా కురవికి చెందిన గుగులోత్ వీరన్న(46) వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం అశోక్‌నగర్ సైనిక్ స్కూల్‌లో పీఈటీగా పని చేసేవారు. ఈ స్కూల్‌లోని ఇద్దరు విద్యార్థులు చెకుముకి జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొందారు. వీరిని ఆదిలాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు తీసుకెళ్లేందుకు వరంగల్ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లేందుకు తాను టికెట్లు తీసుకొని వస్తాను మీరు ముందుగా ప్లాట్‌ఫాంపైకి వెళ్లాలని చెప్పడంతో విద్యార్థులు వెళ్లిపోయారు. టికెట్ కొనుగోలు చేసి స్టేషన్‌లోనికి వెళ్లాడు. అప్పటికే రైలు ప్లాట్‌ఫాంపైకి వస్తుండడంతో మెట్లపై నుంచి వెళ్తే ఆలస్యమవుతుందని పట్టాలు దాటి 4వ నంబర్ ప్లాట్‌ఫాం పైకి ఎక్కే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు కిందపడిపోవడంతో రైలు పీఈటీ మీద నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

పులి పయనమెటు..?

సరిహద్దు అడవుల్లో మళ్లీ పెద్దపులి సంచరించడం ప్రజలను కలవరపెడుతోంది. ఏటా ఇదే సీజన్‌లో మన అడవుల్లోకి వస్తోంది. 2021, 2022 కనిపించిన పులి.. రెండేళ్ల విరామం తర్వాత మళ్లీ ఇప్పుడు ప్రత్యక్షం కావడంతో అలజడి నెలకొంది. కొద్దిరోజులుగా మహారాష్ట్ర నుంచి గోదావరి దాటిన పులి వాజేడు, వెంకటాపూర్, మల్లూరు మీదుగా భూపాలపల్లి జిల్లా సరిహద్దు అడవుల్లో (తాడ్వాయి సమీపం) జాడలు కనిపిస్తుండడంతో అటవీ శాఖ అప్రమత్తమైంది. ఇలా రోజుకో ప్రాంతం లో తిరుగాడుతున్న పులి.. ఏ మార్గంలో ఎటువైపు వెళ్తుందో తెలియాల్సి ఉంది. అయితే మహారాష్ట్రలో ఆధిపత్య పోరు కారణంగా గోదావరి నది దాటి మనుగడ కోసమే మన అడవుల వైపు వస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అటవీ అధికారులు పులి కోసం అన్వేషిస్తుండగా భూపాలపల్లి, చెల్పూరు, దూదేకులపల్లి రేంజ్ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి సరిహద్దు అడవుల్లో పులిజాడలను కెమెరా ట్రాప్‌ల ద్వారా వెతుకుతున్నారు. సరిహద్దు అడవులు చాలా దట్టమైనవని, ఇందులో పులి వేట అంత సులువు కాదని, ఇటువైపు పులి రాకపోవచ్చనే అభిప్రాయపడుతున్నారు.

– జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ)

- మనుగడ కోసం మన అడవుల్లోకి..!
- జాడ కోసం తీవ్రంగా అన్వేషణ
- రంగంలోకి మూడు బృందాలు
- కెమెరా ట్రాప్‌లతో పరిశీలన
- 2021, 2022 తర్వాత మళ్లీ అలజడి
- 2023లో కానరాని సంచారం
- ఏటా ఇదే సీజన్‌లో వస్తున్న పులి

సరిహద్దుల్లో అన్వేషణ

తాడ్వాయి అడవుల్లో పులి సంచారంతో అది భూపాలపల్లి జిల్లా అడవుల్లోకి వస్తుందా అనే కోణంలో అటవీ అధికారులు అన్వేషణ కొనసాగిస్తున్నారు. తాడ్వాయి మండలం పంబాపూర్ అడవుల్లో పులి సంచరించగా అది అక్కడినుంచి 360 డిగ్రీ కోణంలో రోజుకు 25 కిలోమీటర్లు వెళ్తుందని, పంబాపూర్ నుంచి దూదేకులపల్లి గుండా భూపాలపల్లి అడవుల్లోకి వస్తుందా? ఏటూరునాగారం, గుండాల వైపు వెళ్తుందా? అనే విషయమై కెమెరా ట్రాప్‌ల ద్వారా పరిశీలిస్తామని ఒక అటవీ అధికారి తెలిపారు. 2021లో జిల్లాలోని కొయ్యూరు అడవుల్లో పులి సుమారు 15 రోజులు సంచరించిందని, 2022లోనూ పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సరిహద్దుల్లో తిరుగాడడంతో పాటు ముత్తారం శివారు గుట్టలో పశువులపై దాడి చేసిందని అధికారులు చెబుతున్నారు. కాటారం దొబ్బలపాడు అటవీ బీట్‌లో పులి కెమెరా ట్రాప్‌లకు చిక్కింది. 2021, 2022లో వచ్చిన పులులు రెండు ఒక్కటి కావని, వేర్వేరు పులులని గుర్తించారు. కాగా 2023లో మాత్రం సరిహద్దుల్లో పులి ఆచూకీ లేదు.

సరిహద్దు అడవుల్లో అలర్ట్

టైగర్ జోన్‌లో ఆధిపత్య పోరు

కవ్వాలతో పాటు ఇంద్రావతి, తడోబా టైగర్ జోన్లలో పులుల్లో ఆధిపత్య పోరు కొనసాగుతుండడంతో సరిహద్దు దాటి ఇటువైపు వస్తున్నాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో తడోబా టైగర్ జోన్‌లో చాలా పులులు మృత్యువాత పడుతున్నాయని, అలాగే కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలో పులుల సంఖ్య పెరుగడంతో దాడులు పెరిగిపోతున్నాయని చెబుతున్నారు. మేటింగ్ సీజన్ అయిపోయినా సరిహద్దు దాటి రావడం ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నట్లు తెలుపుతున్నారు. 2022లో మహారాష్ట్రలోని చీమూరు జిల్లాలో రెండు పులుల మధ్య జరిగిన దాడిలో ఒక పులి చనిపోయిందని, తడోబా అభయారణ్యంలో మరో పులి, వరోరా అటవీ రేంజ్ పరిధిలో ఒక పులి, పలాస్‌గావ్ అటవీ ప్రాంతంలో మరో పులి, సిండేవాహి రేంజ్‌లో విద్యుత్ షాక్‌తో మరో పులి మృతిచెందిందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలో మహారాష్ట్ర నుంచి పులులు గోదావరి దాటుతున్నట్లు తెలుస్తోంది. గోదావరి నదిలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ నీటిలో పులులు చాలా బాగా ఈదగలవని అటవీ అధికారులు తెలుపుతున్నారు.

పెద్దపులిని చూసి భయపడ్డా..!

- పుల్లలు అక్కడే పడేసి ప్రాణాలు కాపాడుకున్న : పొట్టయ్య
- పులిగండి ఒర్రెలో పెద్దపులిని ప్రత్యక్షంగా చూసిన గిరిజనుడు
- స్థానికుల్లో మళ్లీ మొదలైన ఆందోళన

మంగపేట, డిసెంబర్ 13 : మారుమూల అటవీ ప్రాంత గ్రామం కొత్తూరు మొట్లగూడెం పంచాయతీ పరిధి బొమ్మాయిగూడెం సమీప పులిగండి ఒర్రెలో శుక్రవారం పెద్దపులి కనిపించినట్లు స్థానిక గిరిజనుడు జబ్బ పొట్టయ్య తెలిపాడు. ఎప్పటిలాగే చీపురు పుల్లల కోసం అడవికి వెళ్లిన తనకు పులిగండి ఒర్రెలో పెద్దపులి కనిపించగా సేకరించిన చీపురు పుల్లలు అక్కడే వదిలేసి పరుగు తీసి ప్రాణాలు కాపాడుకున్నానని చెప్పాడు. పొట్టయ్యకు పులి కనిపించిన విషయం అటవీ అధికారులకు చీకటి పడ్డాక తెలిసింది. శనివారం సిబ్బందితో కలిసి పులిగండి ప్రాంతాన్ని పరిశీలిస్తామని ఇన్‌చార్జి రేంజ్ అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. చుంచుపల్లి వద్ద గోదావరి దాటి తిమ్మాపురం మీదుగా వచ్చిన పెద్ద పులి తాడ్వాయి మండల పరిధి అడవిలోకి వెళ్లిందని అటవీ అధికారులు ప్రకటించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే పులి కనిపించిందని చీపురు సేకరణకు వెళ్లిన వ్యక్తి ద్వారా తెలియడంతో కొత్తూరుమొట్లగూడెం, బొమ్మాయిగూడెం గ్రామాల ప్రజలు మళ్లీ ఆందోళనలో పడ్డారు. పులి సంచారంపై కచ్చితమైన సమాచారమిచ్చి ప్రజల్లో నెలకొన్న ఆందోళనను తొలగించాలని స్థానికులు అటవీ శాఖ అధికారులను కోరుతున్నారు.

అబద్ధాలతో మోసం చేసిన రేవంత్

- రుణమాఫీపై సర్కారు తప్పుదోవ పట్టించింది
- రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని నిలదీసిన రైతులు
- ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కరిస్తానని హామీ
- ఘనంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ డైమండ్ జూబ్లీ వేడుకలు

అగ్రికల్చర్ యూనివర్సిటీ వజ్రోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న కోదండరెడ్డి

కాశీబుగ్గ, డిసెంబర్13: అబద్ధాలతో రేవంత్ రెడ్డి మోసం చేశాడని, రుణమాఫీపై కాంగ్రెస్ సర్కారు తప్పుదోవ పట్టించిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ నగరంలోని పైడి పల్లిలో గల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ అగ్రి కల్చర్ యూనివర్సిటీ వజ్రోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి హాజరయ్యారు. సభలో రుణమాఫీపై రైతులు ఆయనను నిలదీశారు. రుణమాఫీ వంద శాతం అయినట్లు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు అబద్ధాలు చెప్పా రని ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ కాకుంటే రైతులంతా ఏకమై ప్రభుత్వా నికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. వెంటనే స్పందించిన కోదండరెడ్డి తొందర పడొద్దని, టెక్నికల్ ప్రాబ్లమ్‌తో రుణమాఫీ నిలిచిపోయిందన్నారు. తొందర్లోనే ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆశపెట్టి మోసం చేశారు

కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో రూ. రెండు లక్షల రుణం మాఫీ చేస్తామని ఆశపెట్టి మోసం చేశారు. ఇప్పటి వరకు 60 శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ చేసిన్రు. పాలమూరులో జరిగిన రైతు సభలో వంద శాతం రుణమాఫీ చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధం చెప్పిండు. అలాగే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు కూడా చెప్పి రైతులను తప్పుదోవ పట్టిస్తున్నరు. రూ. 2లక్షలపైన ఉన్న లోన్ వ్యవసాయానిది కాదని, కమర్షియల్ అని దాటవేస్తున్నరు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలి. రైతు భరోసా రెండు పంటలకు రూ. 15 వేలు అని ఇవ్వలేదు. గత ప్రభుత్వం ఇచ్చినట్లు రైతు లకు 10 ఎకరాల లోపు ఇవ్వాలి.

– కొండారెడ్డి, కొమ్మాల, గీసుగొండ, వరంగల్

చాలా మందికి రుణమాఫీ కాలే..

నాతో పాటు చాలా మంది రైతులకు ఎలాంటి రుణ మాఫీ జరుగలేదు. వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి సమస్యలు పరిష్కరించాలి. సీఎం రేవంత్‌రెడ్డి 2018 డిసెంబర్ 9 నుంచి 12 డిసెంబర్ 2023 లోపు రుణ మాఫీ చేస్తామని చెప్పి రూ. రెండు లక్షల వరకే మాఫీ చేసిండు. రూ. 2లక్షల పైన ఒక్క రూపాయి ఎక్కువ అప్పు ఉన్నా రుణమాఫీ చేయడం లేదు. నాకు రెండు లక్షల పైగా అప్పు ఉండగా రుణమాఫీ కాలేదు. ప్రభుత్వం కావాలనే మోసం చేసింది.

– మంతపూరి యాదగిరి, కన్నయ్యపల్లి, రఘునాథపల్లి, జనగామ

రుణమాఫీ చేయాలని దండం పెడుతున్న కొండారెడ్డి

కరెంట్ కోతలపై కదిలిన యంత్రాంగం

అలంకానిపేటలో రైతులతో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీధర్

ట్రాన్స్‌కో ఏఈడీ విచారణ.. కోతల ఎత్తివేత

నెక్కొండ, డిసెంబర్ 13: కరెంట్ కోతలపై అధికార యంత్రాంగం కదిలింది. మండలంలో ని అలంకానిపేట శివారు పరిధిలో బిల్లులు చెల్లించడం లేదని వ్యవసాయానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండడంపై 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'కరెంట్ కోతలు..ఎండిపోతున్న పంటలు' కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు నెక్కొండ ట్రాన్స్‌కో ఆపరేషన్స్ ఏడీఈ శ్రీధర్ శుక్రవారం గ్రామానికి వెళ్లి విచారణ జరిపారు. విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదనే సాకుతో గత నాలుగు రోజులుగా మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకే వ్యవసాయానికి కరెంట్ సరఫరా చేస్తున్నారని రైతులు ఎండిన పంటలను ఏడీఈకి చూపించారు. విద్యుత్ బిల్లులు చెల్లించడంలేదని ఎలాంటి కోతలు విధించమని ఆయన స్పష్టం చేసి రైతులను సముదాయించడంతో సమస్య సద్దుమణిగింది. శుక్రవారం ఉదయం నుంచి ఎలాంటి కోతలు విధించలేదని రైతులు తెలిపారు.

వ్యవసాయానికి నిరంతర విద్యుత్..

వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా అందిస్తాం. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎవరైనా సర్వీసులను డిస్ కనెక్షన్ చేస్తే ఉపేక్షించేది లేదు. వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో సంబంధిత లైన్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలుంటాయి. బిల్లులు చెల్లించలేదని వ్యవసాయానికి విద్యుత్ సరఫరాను నిలిపివేయడం లేదు.

– ట్రాన్స్‌కో వరంగల్ ఎస్ఈ పీ మధుసూదన్‌రావు